క్లుప్తంగా

గోపాలపురంలో శాంతి ర్యాలీ



క్రిస్మస్ ర్యాలీ నిర్వహిస్తున్న ఏసన్న మినిస్ట్రీస్ పాస్టర్ యేసురాజు, సంఘ సభ్యులు

గోపాలపురం: పాప పరిహారార్థం ఏసుక్రీస్తు మానవ రూపంలో ఈ లోకంలో జన్మించారని మండలంలోని చిట్యాల ఏసన్న మినిస్ట్రీస్ పాస్టర్ తాడేపల్లి యేసురాజు అన్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఆదివారం గోపాలపురం లో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భం గా పాస్టర్ యేసురాజు మాట్లాడుతూ ఏసు క్రీస్తు 2024 ఏళ్ల క్రితం ఈ లోకంలో బోధనలు చేశారన్నారు. సోమవారం గోపాలపురం బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఆవరణలో నిర్వహించే మెగా క్రిస్మస్ వేడుకలకు దైవజ నులు హాజరు కావాలని కోరారు.

అన్న సమారాధన



ప్రత్యేక పుష్పాలంకరణలో భక్తాంజనేయస్వామి

నిడదవోలు రూరల్: మండలంలోని కాట కోటే శ్వరంలో హనుమత్ వ్రత మహోత్సవాల సంద ర్భంగా భక్తాంజనేయ ఆలయం వద్ద ఆది వారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తుల స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రామానుజన్‌కు నివాళి



చిట్యాల హైస్కూల్లో రామానుజన్ చిత్ర పటానికి నివాళులు

గోపాలపురం: జాతీయ గణిత శాస్త్ర దినో త్సవం సందర్భంగా ఆదివారం మండలంలోని చిట్యాల జెడ్పీ హైస్కూల్‌లో గణిత మేధావి శ్రీనివాస రామాజన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీపాద లక్ష్మీ నరసింహశాస్త్రి మాట్లా డుతూ మానవుని దైనందిన జీవితంలో ప్రతీదీ లెక్కలతో ముడిపడి ఉందన్నారు. ఆధునిక ప్రపంచ గణిత మేధావుల్లో రామానుజన్ అగ్ర గణ్యుడన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, అరుణకుమారి, తేజస్విని, రాజేష్, సీఆర్పీ కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

ముగిసిన దాసాంజనేయ స్వామి ఉత్సవాలు



వాడపల్లిలో దాసాంజనేయస్వామి వారి ఊరేగింపులో ఆకట్టుకున్న శక్తి వేషాలు

కొవ్వూరు: వాడపల్లి గ్రామంలోని ఏటిగట్టుపై గల దాసాంజనేయ స్వామి హనుమద్వ్ర ఉత్స వాలు ఆదివారంతో ముగిశాయి. పది రోజు లుగా గ్రామంలో స్వామి వారి ఉత్సవాలు నిర్వ హిస్తున్నారు. చివరి రోజు స్వామిని ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. శక్తి వేషాలు, డప్పు వాయిద్యాలు, వివిధ రకాల వేషధారణలతో గ్రామంలోని వీధివీధినా స్వామి వారిని ఊరే గించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శక్తి వేషధారుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకు న్నాయి. దారి పొడవునా భక్తులు బారులు తీరి ఊరేగింపును, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

40 మద్యం బాటిళ్ల స్వాధీనం

కొవ్వూరు: పట్టణంలోని ఎరినమ్మ ఆలయం దిగువన శ్రీనివాసపురంలో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న పోతుగుంట శివ అనే వ్యక్తిని ఆదివారం రాత్రి అరెస్ట్ చేసినట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. అతడి వద్ద నుంచి 40 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలి పారు. తమకు అందిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించామన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

కొవ్వూరు: వైద్య ఖర్చుల నిమిత్తం నియోజకవ ర్గంలోని తొమ్మిది మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.4,11,900 నిధులు విడుదలైనట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు ప్రకటించారు. ఆదివారం రాత్రి టీడీపీ కార్యాలయంలో బాధితులకు చెక్కులు పం పిణీ చేశారు. ధర్మవరం గ్రామానికి చెందిన కొత్తపల్లి వీరాఘవులకు రూ.27,070 చెక్కులు ఎమ్మెల్యే అందజేశారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు గారపాటి వెంకటకృష్ణ, నాయకులు పెనుమాక జయరాజు, సూర్యదేవర రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు వరం పీఎంశ్రీ

- ఐదేళ్లపాటు బడులకు ఊతం
- నియోజకవర్గంలో నాలుగు హైస్కూళ్ల ఎంపిక
- తొలి విడత నిధుల విడుదల

నల్లజర్ల: విద్యా వికాసంతోనే దేశ ప్రగతి సాధ్యం.ఈ విషయాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల్లోని విద్యా సంస్థల అభివృద్ధికి ఇతోధికంగా ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వస్తోంది. దీనిలో భాగంగా ప్రధానమంత్రి స్కూల్ ఫండ్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) అనే పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రాథమిక విద్యారంగంలో సమూల మార్పులు తీసుకురావడం, మౌలిక వస తులు కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం.ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులను మంజూరు చేస్తే మిగిలిన 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది. ఐదేళ్ల పాటు ఈ సాయం అందుతుంది. ఈ నేపథ్యంలో గత రాష్ట్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది.

గోపాలపురం నియోజకవర్గంలో..

పీఎంశ్రీ పథకం అమలుకు నిర్దేశించిన 46 అంశాల ఆధారంగా గోపాలపురం నియోజకవర్గంలో నాలుగు పాఠశాలలను గుర్తించి, గతేడాది నవం బరులో విద్యాశాఖాధికారులు ప్రతిపాదనలు పం పారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు 60 శాతం మార్కులు, పట్టణ ప్రాంతంలోని పాఠశా లలు 70 శాతం మార్కులు సాధిస్తే వాటిని పీఎంశ్రీ పథకం లబ్ధి కోసం ఎంపిక చేస్తారు. నల్లజర్ల మం డలంలోని అనంతపల్లి జెడ్పీ హైస్కూలు, ద్వారకా తిరుమల మండలంలోని పంగిడిగూడెం, దేవర పల్లిలోని దేవరపల్లి, గోపాలపురం మండలంలోని చిట్యాల పాఠశాలలు ఎంపికయ్యాయి.



అనంతపల్లి జెడ్పీహైస్కూల్ క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ-2 భగవతి



అనంతపల్లి హైస్కూలు భవనం

మౌలిక వసతుల పెంపు

ఈ పథకం కింద పాఠశాలల్లో విద్యాబోధన, సదుపాయాలలో నాణ్యతా ప్రమాణాల పెంపు, తరగతి గదుల నిర్మాణం, ఇతర వసతుల కల్పన, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా బోధన సామగ్రి సమకూర్చనున్నారు. కెమిస్ట్రీ ల్యాబ్, కిచెన్ గార్డెన్, రెయిన్ వాటర్ హార్వెస్టర్, మరు గుదొడ్ల నిర్మాణం, వికలాంగులకు ర్యాంపులు, క్రీడా మైదానాల అభివృద్ధి వంటి పనులు చేపట్ట నున్నారు.

హెచ్‌ఎం నుంచే ప్రతిపాదనలు

ఇప్పటికే 'నాడు-నేడు' పథకం ద్వారా పాఠశా లల రూపురేఖలు మారాయి.ఈ నేపథ్యంలో పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలల్లో అత్యాధునిక హంగులు, డిజిటలైజేషన్ దిశగా చర్యలు చేపడ తారు. ఆయా ప్రతిపాదనలు తయారీ ప్రక్రియపై హెచ్‌ఎంలకు సూచనలు చేశారు. ఈ విధంగా రూపొందించిన ప్రతిపాదనలను జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ కార్యాలయానికి పంపగా, వాటిని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపింది. మొదటి విడత నిధులు ఇప్పటికే మంజూరయ్యాయి.

విద్యలో పిల్లలు రాణించేందుకు అవకాశం



ప్రాథమికోన్నత పాఠశాలలు 'నాడు-నేడు' పథకంలో అభివృద్ధి చెందాయి. వాటితో పాఠశా లల స్వరూపం పూర్తిగా మారింది. తాజాగా మా పాఠశాల పీఎంశ్రీకి ఎంపిక కావడం సంతోషంగా ఉంది. మరిన్ని సదుపాయాలతో పాఠశాల అభివృద్ధి చెందనుంది. దీంతో విద్యార్థులు చదువులో మరింతగా రాణించే అవకాశం ఉంది.

–హేమంత్‌కుమార్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం, జెడ్పీ హైస్కూల్, అనంతపల్లి

దశల వారీగా నిధుల విడుదల



ఎంపికైన పాఠశాలలకు దశలవారీగా నిధులు విడుదల చేస్తారు. పర్య వేక్షణ అంతా ఎంఈఓదే. డిజిటల్ పద్ధతిలో బోధన. ప్రయోగశాలలు, ఇతర సౌకర్యాలతో పాటు ఉపాధ్యాయులకు శిక్షణ . ఆర్థిక, సాంకేతిక సహకారం. సంప్రదాయ విధానాలపై విద్యార్థులకు అవగాహన. పాఠ శాల ఆవరణలోనే సేంద్రియ విధానంలో కూరగాయల సాగు.అ భ్యసన నైపుణ్యంపై విద్యార్థులకు శిక్షణ. బాలికా విద్యాభివృద్ధి, సైన్స్ ప్రాజెక్టులు, సోలార్ ప్యానెల్స్, ఎల్‌ఈడీ దీపాల సౌకర్యం.అన్ని కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల భాగస్వామ్యం ఉంటుంది.

–భగవతి, ఎంఈఓ–2, నల్లజర్ల మండలం

మామిడి పంటకు బీమా వర్తింపు

- ప్రీమియం చెల్లింపునకు 31 వరకూ గడువు

నల్లజర్ల: వాతావరణ ఆధారిత బీమా పథకంలో మామిడి పంటకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పిం చింది. ఈ నేపథ్యంలో ప్రీమియం చెల్లింపు గడువు, బీమా వర్తింపు అవకాశాలను నల్లజర్ల ఉద్యాన శాఖాధికారి బబిత వెల్లడించారు. బీమా చెల్లింపునకు అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా సంస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో ఒప్పందం కుదుర్చుకుం దన్నారు. ఎకరం మామిడితోటకు రైతులు బీమా ప్రీమియంగా రూ.2100 చెల్లించాలి. ఈ ప్రీమియం చెల్లింపునకు డిసెంబరు 31 చివరి తేదీగా ప్రకటిం చారు. ఐదేళ్ల వయస్సు తోటలకే ఈ బీమా పథకం వర్తిస్తుంది. 31 డిసెంబరు 2024 నుంచి 2025 మే 31వరకూ ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ కాలంలో అధిక వర్షపాతం, గాలిలో తేమశాతం, వాతావరణ వ్యత్యాసం, అధిక గాలులు తదితర కారణాలతో మామిడి పంటకు నష్టం వాటిల్లితే ప్రభుత్వ నిబం ధన మేరకు అంచనావేసి రైతులకు నష్టపరిహారం అందిస్తారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా మామి డితోటలు దెబ్బతింటే ఎకరానికి రూ.42 వేల నష్టప రిహారం అందిస్తారు.



మామిడితోట

ప్రీమియం చెల్లింపునకు రైతులు తమ భూమి పాస్ బుక్ జిరాక్స్, పంట ఉన్నట్టు రైతు సేవాకేంద్రంలో ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను తీసుకెళ్లి ప్రీమియం సొమ్ము చెల్లించాలి. దీంతో పాటు ఈక్రాప్ నమోదు చేయించాల్సి ఉంటుందని బబిత వివరించారు.

ఎరువు.. మితిమీరితే అనర్థమే

- మోతాదుకు లోబడితేనే పంటకు మేలు
- వ్యవసాయాధికారి కమల్‌రాజ్

నల్లజర్ల: వాతావరణం అనుకూలించడంతో పాటు నీరు అందుబాటులో ఉండడంతో దాళ్వా వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో ఈ సీజ న్‌లో ఎనిమిది వేల ఎకరాల్లో రబీ వరి సాగు చేస్తు న్నారు. ఇంతవరకూ 3,016 ఎకరాలలో మాత్రమే నాట్లు వేశారు. ఎంటీయూ1121, శ్రీధృతి, ఎస్‌ఎల్ 1010, పీఎల్ 1100 రకాలను రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. సాగులో కొద్దిపాటి మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ సూచించారు. వరి పంటకు మోతాదుకు మించి ఎరువులు వినియోగిస్తు న్నారని ఆయనన్నారు. పైరుకు యూరియా నాలుగైదు సార్లు వేయడం అనర్థదాయకం అని ఏవో స్పష్టం చేశారు. గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం ద్వారా విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు అందిస్తున్న సూచ నలను పాటించాలన్నారు. తద్వారా ఖర్చు తగ్గడమే కాకుండా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. భూసార పరిరక్షణతో పాటు నాణ్యమైన పంట ఉత్ప త్తులు సాధించాలంటే రసాయన ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులను కూడా వినియోగించాలన్నారు. యూరియా ఎక్కువగా వాడితే మొక్కలో రోగ నిరోధక శక్తి తగ్గుతుందన్నారు. దీంతో చీడపీడలు ఎక్కువ అవు తాయన్నారు. కలుపు మొక్కలు త్వరగా పెరుగుతా యన్నారు. ఒక హెక్టారుకు 78 కిలోల నత్రజనిని మూడు భాగాలుగా చేసుకుని ఒక భాగం దమ్ములోను, రెండో భాగం నాటిన 15 రోజులకు, మిగతాది 30-35 రోజుల వ్యవధిలో వేయాలన్నారు. వేప పిండితో కలిపి వేసుకున్నట్టయితే నత్రజని వినియోగం పెరుగుతుంద న్నారు. భాస్వరం డీఏపీ, సూపర్, కాంప్లెక్స్ రూపంలో ఏదో ఒక ఎరువు 36 కిలోలు దమ్ములో వేసుకోవాల న్నారు. పైపాటుగా వేయరాదన్నారు. రేగడి నేలల్లో పొటాష్ 24 కిలోలు ఒకే దఫాగాను, తేలిక నేలల్లో రెం డుసార్లుగా వేయాలన్నారు. జింక్ లోపం ఎక్కువగా ఉంటే ఒక గ్రాము జింక్ సల్ఫేట్‌ను ఒక లీటరు నీటిలో కలిపి పంటకు పిచికారీ చేసుకోవాలన్నారు. వారం వ్యవధిలో రెండు సార్లు ఈ విధంగా చేయాలన్నారు.



ఎరువుల వినియోగంపై రైతుకు అవగాహన కల్పిస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సురేష్

సోషల్ ఆడిటింగ్‌కు సహకరించాలి

పెరవలి: గ్రామాల్లో నిర్వహించే ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిటింగ్‌కు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సోషల్ ఆడిట్ బృందాలు సహకరించాలని ఎంపీడీఓ సీహెచ్ వెంకటరమణ కోరారు. మండలంలోని సోషల్ ఆడిట్ కో -ఆర్డినే టర్ల సమావేశం ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ మండలం లో 2023-24లో నిర్వహించిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ బృందాలు గ్రామాలకు తనిఖీలకు వచ్చినపుడు వారికి కావలసిన సమాచారం అందిం చాలన్నారు. ఈ బృందాలు ఉపాధి పనులను పరిశీలించడమే గాకుండా, ఆ పనుల్లో పాల్గొన్న కూలీల వివరాలను కూలీల వద్దకే వెళ్లి విచారిస్తార న్నారు. రికార్డుల ప్రకారం తనిఖీలు చేస్తారన్నారు. అంతేగాకుండా పింఛన్లను కూడ తనిఖీ చేస్తారని తెలిపారు. తనికీలు నిర్వహించేటప్పుడు ఆయా గ్రామాల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పూర్తి సహ కారం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఎస్‌ఆర్పీ, టీఏ, సీఓ, కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.



సోషల్ ఆడిట్ కో ఆర్డినేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

శరవేగంగా విద్యుత్ సమస్యల ప్రక్షాళన

దేవరపల్లి: మండలంలో విద్యుత్ సమస్యల ప్రక్షా ళన వేగంగా జరుగుతోంది. రెండు నెలలుగా అధి కారులు నిబద్ధతతో పని చేస్తున్నారు. విద్యుత్ వినియోగదాల సమస్యలను దృష్టిలో పెట్టుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టారు. పలు గ్రామా లకు నూతనంగా టౌన్ ఫీడర్లను ఏర్పాటు చేసి 24 గంటల విద్యుత్ సరఫరాకు చర్యలు చేప ట్టారు. దాదాపు 30 ఏళ్లుగా విద్యుత్ సమస్యలతో సతమతం అవుతున్న ప్రజలులు టౌన్‌ఫీడర్ ఏర్పాటుపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాతబ డిన విద్యుత్ స్తంభాలను తొలగించి ఆ స్థానంలో దాదాపు 12.5 మీటర్ల ఎత్తుగల విద్యుత్ స్తం భాలు ఏర్పాటు చేసి కొత్త వైర్లు వేస్తున్నారు. పలు ప్రాంతాల్లో లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. వినియో గదారులు, రైతులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఏబీ స్విచ్‌లను ఏర్పాటు చేసి సమస్యకు అధికారులు చెక్ పెట్టారు. దేవరప ల్లిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆరు గ్రామాలకు టౌన్ ఫీడర్ సౌకర్యం కల్పిస్తున్నారు. పనులు దాదాపు పూర్తికావచ్చినట్టు అధికారులు తెలిపారు. ప్రతి శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాను నిలుపుదల చేసి పనులు చేస్తున్నారు. మరొక కొద్ది రోజుల్లో పనులు పూర్తికానున్నట్టు ఏపీడీసీ ఎల్ ఈఈ ఎస్. నారాయణ అప్పారావు, ఏఈ చిలకా వెంకట్రావు తెలిపారు. శుక్రవారం సబ్‌స్టే షన్‌లో మరమ్మతులు నిర్వహించి కొత్త పరికరా లను ఏర్పాటు చేశారు.



దేవరపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

దొంగలు బాబోయ్.. దొంగలు

తాళ్లపూడి: వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తు తున్నారు. ముఖ్యంగా వేగేశ్వరపురం, అన్నదేవ రపేట గ్రామాల్లో ఇటీవల పలు చోరీలు జరిగాయి. వారం రోజుల వ్యవధిలో వేగేశ్వరపు రంలో ఐదుకు పైగా చోరీ కేసులు నమోద య్యాయి. మెయిన్ రోడ్డులోని కై గాల కాంప్లె క్స్‌లోని కిరణా షాపులో రాత్రి పూట తలుపులు పగల గొట్టి సుమారు రూ.10 వేల వరకూ నగదు, సరకులు చోరీ చేశారు. పక్కనే ఉన్న టిం బర్ డిపోకు చెందిన గదిలోని రూ.50 వేల వరకూ నగదు కాజేశారు. శీర్ల వారి వీధిలోని ఓ ఇంట్లో బీరువా పగలగొట్టి అందులోని వస్తువు లనుఎ అపహరించుకు పోయారు. గ్రామంలోని ఒక మోటార్ బైక్ కూడా చోరీ చేశారు. ధనమ్మ తల్లి ఆలయంలో నగదు చోరీ చేసినట్టు గ్రామ స్తులు తెలిపారు. గత నెలలో సాయిబాబా ఆలయంలో హుండీ పగలగొట్టి నగదు అపహరించుకు పోయారు. ఈ దృశ్యాలు సీసీ టీవీలో కూడా రికార్డయ్యాయి. అంతేగాకుండా కరిబండి కళాశాలలో మోటార్ వైర్లను అపహరిం చుకుపోయారు. పంట పొలాల్లో రైతులకు చెం దిన మోటార్ బోర్ల చెందిన వైర్లను రాగి కోసం తరచూ చోరీలు కాజేస్తున్నారు. ఇక అన్నదేవర పేటలో ఇటీవల రెండు ఘటనల్లో బంగారు ఆభరణాలు చోరీ చేశారు. మహిళ మెడలో బం గారు గొలుసు కూడా తెంపుకుని పోయారు. ఈ వరుస చోరీలపై తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ మాట్లాడుతూ ఇప్పటివరకూ మూడు చోరీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. నిఘా పెడుతున్నట్టు చెప్పారు.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

- యథేచ్ఛగా కాలువ గట్లపై చెట్ల నరికివేత
- రెండు మండలాల నుంచి అక్రమంగా తరలిపోతున్న పుల్ల
- రూ.లక్షలు సంపాదిస్తున్న అక్రమార్కులు
- రోజుకు 100 టన్నుల పుల్ల తరలింపు

దేవరపల్లి: అక్రమార్కుల అక్రమాలకు అడ్డులేకుండా పోతోంది. వారి ఆగడాలు రోజురోజుకూ మితిమీరిపో తున్నాయి. కొందరు అధికార పార్టీ నేతల అండదండ లతో పోలవరం కుడికాలువ, తాడిపూడి ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువ గట్లపై గల వృక్షాలను నరికి పుల్లను అక్రమంగా రవాణా చేసి రూ.లక్షలు ఆర్జిస్తు న్నారు. గట్లపై గల వేప, కంచి చిత్రం, ఇతర మారు జాతి చెట్లను యథేచ్ఛగా నరికి వేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ తెల్లవారుజాము 4 నుంచి ఉదయం 8 గంటల వరకు చెట్లను నరికి సాయంత్రం చీకటిపడిన తర్వాత పుల్లను ట్రాక్టర్లపై పొగాకు బ్యారన్ల వద్దకు తరలించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. టన్ను పుల్ల రూ.3,500 నుంచి రూ.4,000 పలుకుతోంది. మెట్ట ప్రాంతంలో పొగాకు క్యూరింగ్‌కు రైతులు పుల్లను వినియోగిస్తారు. ప్రస్తుతం పొగాకు సీజన్ కావడంతో పుల్లకు డిమాండ్ ఏర్పడింది. ట్రాక్టర్ పుల్లకు సుమారు రూ.15 నుంచి రూ. 20 వేల ఆదాయం వస్తోంది. రెండు నెలలుగా పుల్ల వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా జరుగుతోంది. ఏటా అక్టోబరు నుంచి మార్చి వరకూ పుల్ల వ్యాపారం జరుగుతుంది. గోపాలపురం, దేవరప ల్లి మండలాల్లో అడవులను తలపించేలా కాలువ గట్లు ఉన్నాయి. దాదాపు 20 ఏళ్ల క్రితం నాటిన మొక్కలు ప్రస్తుతం వృక్షాలుగా తయారయ్యాయి.

కాలువ గట్లపై అక్రమార్కుల కన్ను

అక్రమార్కుల కన్ను కాలువ గట్లపై పడింది. అధికారం మనదే అడ్డువచ్చేవాడు ఎవడు? అన్నట్టుగా పుల్ల మాఫియా రెచ్చిపోతోంది. ఒకపక్క పర్యావరణ పరిరక్షణకు చెట్లను విరివిగా పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రూ.కోట్లు ఖర్చు పెట్టి మొక్కలు పెంచుతోంది. మరోపక్క పెరిగిన చెట్లను నరికి కొంత మంది అక్రమ వ్యాపారులు నరికి సొమ్ము చేసుకుంటు న్నారు. రోజుకు సుమారు 100 టన్నుల పుల్ల దేవర పల్లి, గోపాలపురం, పోలవరం మండలాల నుంచి తరలిపోతున్నట్టు సమాచారం. కాలువ గట్ల అభివృద్ధి పేరుతో అధికారులు జారీ చేసినట్టుగా కొంత మంది వ్యాపారులు నకిలీ ధ్రువీకరణ పత్రాలను చూపించి చెట్లను నరికి పుల్లను తరలిస్తున్నట్టు సమాచారం.

అడ్డుకున్న పంచాయతీ సిబ్బంది

కాలువ గట్లపై అక్రమంగా నరికి వేస్తున్న చెట్లను ఇటీ వల గ్రామ పంచాయతీ సిబ్బంది, పంచాయతీ సభ్యులు అడ్డుకుని నరికిన పుల్లను స్థానిక శ్మశానవా టికకు తరలించారు. దేవరపల్లి–లక్ష్మీపురం రోడ్డు, దేవరపల్లి నుంచి హైస్కూలు రోడ్డులోని పోలవరం కుడికాలువ గట్టుపై గల పెద్ద పెద్ద చెట్లను నరికి వేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల పేరు చెప్పుకుని కొంతమంది వ్యాపారులు చెట్లను నరికివే స్తున్నట్టు సమాచారం. ఇంత జరుగుతున్నా సంబం ధిత అధికారులు మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరి స్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



దేవరపల్లి-లక్ష్మీపురం రోడ్డులో పంప్‌హౌస్ వద్ద పోలవరం కుడి కాలువ గట్టుపై అక్రమార్కులు నరికిన పుల్ల



దేవరపల్లి వద్ద పోలవరం కుడి కాలువ గట్టుపై అక్రమార్కులు నరికిన వేపచెట్టు మాను

అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలి

నిడదవోలు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అను చిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కేవీపీఎస్ జిల్లా నాయకుడు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలపై స్థానిక గణపతి సెంటర్‌లో కేవీపీ ఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలి పారు. అమిత్ షా క్షమాపణ చెప్పాలని, లేకుంటే దళిత సంఘాలతో ఉద్యమి స్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు.



నిడదవోలులో నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్, దళిత సంఘాల నాయకులు

విరాళాలతో స్కూల్ టాయిలెట్స్ ఆధునీకరణ

ఉండ్రాజవరం: పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకొచ్చారు. వారిచ్చిన విరాళా లతో ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో టాయిలెట్స్ ఆధునీకరణ పనులు చేపడ తారు. ఈ పాఠశాలలో టాయిలెట్స్ బ్లాక్స్ ఆధునీకరణకు కరూర్ వైశ్యాబ్యాంక్ రూ. 3 లక్షల విరాళం ప్రకటించింది. అలాగే స్థానిక సుంకవల్లి ట్రస్ట్ అధినేత, డాక్టర్ సుంకవల్లి సూర్యనారాయణ, ఈ పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు యివ్వల రాంబాబు చెరో రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఆ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన గణిత దినోత్సవ కార్యక్రమంలో దాతలు విరాళాలు అంద జేశారని హెచ్ ఎం కె.మాణిక్యాలరావు తెలిపారు. ఈ వితరణతో పాఠశాల విద్యా ర్థులకు మేలు జరుగుతుందని దాతలను కొనియాడారు.

27న రాజమహేంద్రవరంలో సీపీఐ శత జయంతి ఉత్సవాలు



భీమోలు సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

గోపాలపురం: ఈనెల 27న రాజమహేంద్రవరం లో నిర్వహించే సీపీఐ శత జయంతి ఉత్సవాలకు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు కోరారు. మండలంలోని భీమోలు గ్రామంలోని సీపీఐ కార్యాలయం వద్ద ఆదివారం నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా మధు మాట్లాడుతూ ఈనెల 26తో సీపీఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుం దన్నారు. ఈ సందర్భంగా 27న రాజమహేంద్రవ రంలో సీపీఐ ఆవిర్భావం నుంచి చేపట్టిన కార్యక్ర మాల ప్రదర్శన, నేతల ప్రసంగాలు ఉంటాయ న్నారు. కార్మిక, కర్షకుల హక్కుల కోసం పోరాడిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పి నాగేశ్వరరావు, కె.జ్యోతిరాజు, కాకులపాటి వెంక ట్రావు, కొవ్వాడియ్య, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

పెరవలి: దోమల నివారణకు పెరవలి పంచాయతీ పరిధిలో ఫాగింగ్ చేశారు. దోమలు పెరిగి పోవడం తో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు వీధుల్లోను, డ్రైన్ల లోను దోమల నివారణ ముందును పిచికారీ చేసినట్టు ఆ పంచాయతీ కార్యదర్శి ఎ.లక్ష్మీనారా యణ తెలిపారు.

వైభవంగా రామదండు శోభాయాత్ర

దేవరపల్లి: స్థానిక గోపాలపురం రోడ్డులోని అభ యాంజనేయ స్వామి ఆలయం లో హనుమాన్ వ్రత వార్షిక మహోత్సవాల సందర్భంగా ఆదివారం భక్తులు రామదం డు శోభాయాత్ర నిర్వహించారు. అభయాంజనే యస్వామిని ప్రత్యేక రథంపై ఉంచి పురవీ ధుల్లో రామదండు శోభాయాత్ర నిర్వహించారు. చిన్నారుల కోలాట నృత్య ప్రదర్శనతో హను మాన్ చాలీసా పారాయణ, రామరామ స్మర ణలతో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గం టల వరకూ యాత్ర నిర్వహించారు. మంగళ వారం ఆలయం వద్ద అన్నసమారాధన జరుగు తుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



దేవరపల్లిలో రామదండు శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు